క్లుప్తంగా

నేడు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



గురజాల: పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాత పాటేశ్వరి అమ్మవారి 426వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం జరగనుంది. శనివారం రాత్రి బియ్యం విడుపు కొలత కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్ల మొదటి రోజు బియ్యం కొలత చేపట్టిన బియ్యంను శనివారం రాత్రి విడుపు తీసి కొలవగా బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల నమ్మకం. నేడు తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారి దేవాలయం విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. ఆదివారం సాయంత్రం శిడిమాను ఉత్సవం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుటుంది. శిడిమానుకు రైతులు తమ పంట పొలాల్లో పండించిన పంటలను శిడిమానుకు కట్టి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ముదిగొండ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవాలయంలో కొలువై వున్న అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారుగా 5 వేల మందికి పైగా భక్తులు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాటుతో పాటు తగు చర్యలు చేపట్టారు. దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు ఆధ్వర్యంలో ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు.

మాలధారులకు సద్ది వితరణ



రెంటచింతల: వివిధ స్వామి మాలధారులకు సద్ది వితరణ చేస్తే ఎంతో పుణ్యఫలమని స్థానిక శివాలయం చైర్మన్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి(రాంబాబు), పాత పాలువాయి గ్రామానికి చెందిన స్వాములతో కలిసి 28వ రోజు స్వాములకు ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంచి మనస్సుతో ముందుకు వచ్చి దీక్ష తీసుకున్న మాలధారులకు సద్ది ఏర్పాటుచేయడం చాలా సంతోషకరమన్నారు. వేదపండితుడు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో హోమాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నా వెంకటేశ్వర్‌రెడ్డి, కట్టెబోయిన సైదులు, గురుస్వామి కట్టమూరి శ్రీను, గుండా రాము, బరువు శివారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రెంటచింతల పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



రెంటచింతల: వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రవి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించి ల్యాబ్‌లో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలను తెలుసుకుని రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నీషియన్లు ఖచ్చితంగా నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాల(ఓపీ) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం రెంటచింతల-3 సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాక్సిన్ పాయింట్‌ను సందర్శించి అక్కడ రికార్డులు పరిశీలించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ హనుమంతురావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ప్రదీప్ కుమార్‌రెడ్డి, రమాదేవి, సూపర్‌వైజర్లు ఎస్.కోటేశ్వరరావు, హెచ్‌వీ లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయం

అచ్చంపేట: వైఎస్సార్ జిల్లా, పులివెందుల నియోజకవర్గంలోని వేమలలో సాగునీటి సంఘ ఎన్నికలపై మీడియా కవరేజ్‌కు వెళ్లిన సాక్షి బృందంపై దాడి చేసి గాయపరచడం దారుణమని, ఇది ముమ్మాటికి మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపసారు. నాల్గవ మూల స్తంభంగా పిలువబడే మీడియాకే రక్షణ లేనప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. దోషులు ఎంతటి వారైనా తక్షణమే అరెస్ట్ చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

వాయిదా పడిన గండిగనుమల సాగునీటి సంఘం ఎన్నిక



నాదెండ్లలో ఎన్నికైన పలునీటి సంఘాల చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు



గణపవరంలో చైర్మన్‌గా ఎన్నికైన రమణయ్యకు ఎన్నిక పత్రాన్ని అందిస్తున్న అధికారులు



ములకలూరు సాగునీటి సంఘం సభ్యులుగా ఎన్నికైన వారితో ఎంపీడీఓ కృష్ణకుమారి

నరసరావుపేటరూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలోని 14 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం రెండు చోట్ల నిర్వహించారు. రావిపాడు, యల్లమంద గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఈ ఎన్నికలు జరిగాయి. 14 సంఘాలకు గాను అన్ని సంఘాలు ఏకగ్రీవాలయ్యాయి. తొలుత టీసీ సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. వీరిలో నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. రావిపాడు-1 బొడ్డపాటి బిక్షాలు, రావిపాడు-2 నరిశెట్టి తంబిజోసఫ్, పాలపాడు- పులిమి రామిరెడ్డి, ఇక్కుర్రు-1 బొడ్డపాటి శేషయ్య, ఇక్కుర్రు-2 కంటు అరుణ, పమిడిమర్రు- సూరే పెద్దారావు, కాకాని-1 చల్లగుండ్ల హనుమంతరావు, కాకాని-2 అడపాల శ్రీనివాసరావు, యల్లమంద-1 బొప్పుడి రామచంద్రప్రసాద్, యల్లమంద-2 చాపలమడుగు హనుమంతరావు, కేసానుపల్లి- జడా దాసు, గురవాయపాలెం-జాగర్లమూడి హనుమంతరావు, పమిడిపాడు-కంచేటి సుబ్బారావు, ములకలూరు-కొరిటాల గోపాలరావులు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

రొంపిచర్ల మండలంలో...

మండలంలోని 15 సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతగుడిపాడు- లింగా రవికుమార్, అన్నవరం- ఈదర నాగేశ్వరరావు, మాచవరం- యాంపాటి కోటిరెడ్డి, సంతగుడిపాడు-2 కందుల కోటయ్య, దాసరిపాలెం- నిడమానూరి శ్రీనివాసరావు, దాసరిపాలెం-2 మాదినీడి అంజయ్య, గోగులపాడు- జవ్వాది నరసింహయ్య, తురిమిళ్ల- చిరుమామిళ్ల మల్లయ్య, అన్నవరం-2 వడ్లమూడి రామాంజనేయులు, ముత్తనపల్లి గాడిపర్తి ప్రసాద్, కొత్తపల్లి-గంగూరి శివరాఘవయ్య, విప్పర్ల- రామిశెట్టి వెంకటేశ్వరరావు, అలవాల- గంటా హనుమప్రసాద్, అన్నవరప్పాడు- కొత్త యల్లారెడ్డి, గోగులపాడు-2 పొందూరి అంకమ్మరావులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

బొల్లాపల్లి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఏడు మైనర్ సాగునీటి సంఘాల్లో ఒకటి మినహాయించి ఆరు మైనర్, మూడు మేజర్ సాగునీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా ఎన్నికల అధికారులు ప్రకటించారు. మండలంలోని గండిగనుమల సాగునీటి సంఘం ఎన్నిక వాయిదా వేశారు. అధికార పార్టీకి సంబంధించి పొత్తు విషయంలో రాజీ కుదరక ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఎన్నికల కేంద్రంలో నీటి సంఘం సభ్యుల మధ్య వివాదం చెలరేగింది. సమాచారం తెలుసుకొని బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆ సాగునీటి సంఘం నుంచి అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీ పడటంతో సయోధ్య కుదరక టీసీ సభ్యులు ఓటింగ్‌కు రాకపోవడంతో ఎన్నిక వాయిదాకు కారణమైంది. గండిగనుమల గ్రామం వైఎస్సార్ సీపీకి పట్టున్న గ్రామం కావడంతో అధికార తెలుగుదేశం పార్టీ ఆ సాగునీటి సంఘంలో ఎన్నికలు సజావుగా నిర్వహించలేక, నీటి సంఘానికి సంబంధించిన సభ్యులు ఎన్నికల కేంద్రానికి హాజరుకాలేదు. ఈ విషయమై గండిగనుమల సాగునీటి సంఘం ఎన్నికల అధికారి అనిత మాట్లాడుతూ సాగునీటి సంఘానికి ఎన్నిక వాయిదా వేయడం జరిగిందని, ఎన్నికల్లో 50 శాతం ఓటింగ్ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

నాదెండ్ల మండలంలో..

నాదెండ్ల: మండల పరిధిలో పది నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ముగిశాయి. అన్ని సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కొన్ని సంఘాల ఎన్నికల్లో టీసీ పదవి కోసం అధికార పార్టీకి చెందిన వారే పోటీ పడ్డారు. ఆయకట్టు సాగుదారుల నుంచి ఎన్నికలపై పెద్దగా స్పందన లేదు. 169-కనపర్రు సంఘానికి చైర్మన్‌గా పచ్చా మోహన్, వైస్‌చైర్మన్‌గా వీరంగం దుర్గాప్రసాద్, 170-ఎండుగుంపాలెం సంఘానికి చైర్మన్‌గా నెల్లూరి రామారావు, వైస్ చైర్మన్‌గా షేక్ రసూల్, 173-అప్పాపురం సంఘానికి మద్దుకూరి కృష్ణమూర్తి, నాయుడు నాగేశ్వరరావు, 174-నాదెండ్ల సంఘానికి ఆరె రామారావు, అడుసుమల్లి ఉమామహేశ్వరరావు, 105-చిరుమామిళ్ల సంఘానికి బాపతు వెంకటేశ్వరరెడ్డి, నూతక్కి అచ్చయ్య, 177-తూబాడు సంఘానికి చెన్నుపాటి శ్రీనివాసరావు, పోపూరి మస్తాన్‌రావు, 169-సాతులూరు సంఘానికి కామినేని శ్రీకాంత్, పాటిబండ్ల రమేష్‌బాబు, 175-గణపవరం సంఘానికి తులం రమణయ్య, సోమరాజు శ్రీనివాసరావు, 174-ఇర్లపాడు సంఘానికి పసల వెంకటసుబ్బారావు, కోమటినేని సత్యనారాయణ, 176-సాతులూరుకు గడ్డం శివాజీ, తగడశ వెంకయ్య ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు ఎన్నిక పత్రాలు అందించారు. గణపవరం జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుపొందిన చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లకు ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి నియామక పత్రాలు అందించారు.

ఘనంగా కాశీనాయన ఆరాధన మహోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశీనాయన ఆశ్రమంలో అన్నదాన ప్రభువైన శ్రీశ్రీశ్రీ కాశీనాయన 29వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ చతుర్దశి పౌర్ణమి గడియలలో జ్యోతి ప్రజ్వలన అత్యంత వైభవంగా చేశారు. కాశీనాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్సంగం పారాయణం, భజన నిర్వహించారు. నిత్య అన్నదానంలో 24 గంటల పాటు 108 వంటకాలతో వేలమందికి అన్నసంతర్పణ గావించారు. రాత్రికి బ్రహ్మంగారి పూర్తి నాటకం ప్రదర్శించారు.

డయల్‌యువర్ డీఎంకు ఒకటే ఫోన్‌కాల్

నరసరావుపేట: డయల్‌యువర్ డీఎం కార్యక్రమానికి ఒక ఫోన్‌కాల్ వచ్చినట్లు డిపో మేనేజర్ జీఎస్‌ఎస్ కుమార్ వెల్లడించారు. సత్తెనపల్లి నుంచి అనీల్ ఫోన్‌చేసి నరసరావుపేట నుంచి చెన్నైకు బస్ సర్వీసు నిర్వహించాలని కోరారన్నారు. అయితే మాచర్ల నుంచి తిరుగుతున్న చెన్నై సర్వీసును పిడుగురాళ్ల, నరసరావుపేట డిపోల మీదుగా నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ గర్నె నాగేశ్వరరావు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచిత హోమియో వైద్యసేవలను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ హోమియో వైద్యం శిబిరానికి ప్రముఖ వైద్యుడు రాధా హోమియో ఆన్‌లైన్ కన్సల్టెన్స్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గుడివాడ హేష్మ మంజూష హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.

కేరళ రాష్ట్రంపై బీజేపీ కక్షసాధింపు

- కేరళ సంఘీభావ సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య
- నకిలీ దేశభక్తితో ఫెడరలిజంపై దాడి చేస్తున్న ప్రధాని మోదీ



సభలో మాట్లాడుతున్న కృష్ణయ్య

నరసరావుపేట: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయంగా కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలు అనుసరిస్తూ అన్నీ రంగాలలో దేశంలోనే ముందంజలో ఉండటంతో ఓర్వలేని కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మండిపడ్డారు. ప్రధాని మోదీ కేరళ రాష్ట్రంపై వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం పట్టణం వినుకొండ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) కార్యాలయం వద్ద సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కేరళ సంఘీభావ సభలో పాల్గొని మాట్లాడారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తూ ప్రజల ద్వారా ప్రజా పాలన నడిపిస్తుందని చెప్పారు. అన్ని సూచికలలో కేరళ ప్రభుత్వం మార్గదర్శకంగా ఉండడాన్ని ఓర్వలేని మోదీ కేరళపై కక్ష కట్టి గత ఐదేళ్లలో కేరళకు ఇవ్వాల్సిన రూ.లక్ష కోట్లను ఇవ్వకుండా రాష్ట్రాభివృద్ధిని అస్థిరపర్చేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంక్షేమబోర్డు ద్వారా 60 లక్షల కుటుంబాలకు చట్టపర పెన్షన్ పథకం అమలు చేస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ధాన్యం క్వింటాకు రూ.2,183 మాత్రమే ప్రకటించగా కేరళ ప్రభుత్వం రూ.2,800 ఇస్తుందన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడారు. సమావేశంలో సీపీఎం ఒకటి, రెండో పట్టణ కార్యదర్శులు షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, వివిధ సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు, కె.రామారావు, కె.ఆంజనేయులు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, సుభాష్ చంద్రబోస్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో విజయం తథ్యం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



గెలుద్దాం పదా పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): వ్యక్తిత్వ వికాసం విజయాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగినేని ఫంక్షన్ హాల్‌లో వ్యక్తిత్వ వికాసం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనటం వలన వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. చిత్రలేఖనం, కథలు రాయటం, సంగీతం వినటం ద్వారా వ్యక్తిత్వ వికాసం కూడా పెరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రావులపల్లి పుల్లారావు రచించిన గెలుద్దాం పదా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటులు కేవీ ప్రదీప్‌ను పూలమాలలు దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజరు గాలి వెంకట రమణారావు, మోటివేషన్ స్పీకర్ ప్రముఖ సినీ నటులు ప్రదీప్, న్యాయవాది నలబోతుల రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల ముందు డ్రెయిన్‌లో చెత్త వేయవద్దు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



డ్రెయిన్‌లో సిబ్బందితో మురుగు తీయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రతి ఇంటి ముందు డ్రెయిన్‌లలో చెత్తాచెదారం వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణ ప్రజలకు సూచించారు. శనివారం 32వ వార్డు ఇంటిగ్రేటెడ్ స్కూలు వద్ద నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో కలసి తాను ఇళ్లముందున్న సైడు కాలువల్లో పూడిక తొలగించారు. కల్వర్టుల్లో నిండుకున్న చెత్తను సిబ్బందితో తొలగింపజేశారు. ఇళ్ల ముందున్న సైడు కాలువలను నాపరాళ్లతో మూసేయటం వలన చెత్తాచెదారం పేరుకున్న తొలగించే పరిస్థితి ఉండదన్నారు. అందువలన కాలువలను ఓపెన్‌గా ఉంచాలని కోరారు. మురుగుకాలువలు శుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి జరగదని, తద్వారా ప్రజలు అందరూ రోగాలకు దూరంగా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రావిపాడు రోడ్డు, ప్రకాష్‌నగర్ బాపనయ్యనగర్‌లలో కల్వర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, కాంట్రాక్టర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ముప్పాళ్ళ: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువ లాకుల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యు.సోమేశ్వరరావు శనివారం తెలిపారు. 35-40 సంవత్సరాల వయసు కలిగి, శరీరంపై బిస్కట్ రంగు గీతల చొక్కా ఉందని, కాల్వలో పడి నాలుగు రోజులపైబడి ఉండవచ్చన్నారు. శరీరం బాగా ఉబ్బి, తీవ్ర దుర్వాసన వస్తుండటంతో వీఆర్వో మాబువలి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే ఖననం చేయటం జరిగిందని చెప్పారు.

నేడు గుండె పరీక్షల వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న స్కాలర్స్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత గుండె పరీక్షల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్టీయూ పల్నాడు అధ్యక్షుడు రామలింగారెడ్డి తెలిపారు. తాగేపల్లి మణిపాల్ హాస్పటల్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిడుగురాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి కార్డియాలజిస్టులు డాక్టర్ దగ్గు నరసింహారెడ్డి, డాక్టర్ శివకోటిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు ఉపయోగించుకోవాలన్నారు.

రేపటి నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



గురజాల: శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి 426వ తిరునాళ్లను పురస్కరించుకుని గురజాల రైతు సంఘం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతాయని రైతు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సీనియర్ విభాగం, జూనియర్స్ విభాగం, ఆరు పళ్ల జతల విభాగం, నాలుగు పళ్ల జతల విభాగాల్లో బహుమతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9912429126, 9849280288 నెంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

కేంద్రియ విద్యాలయలో ఒత్తిడి లేని విద్య

- డీఆర్వో మురళీ
- ఘనంగా కేవీ వ్యవస్థాపక దినోత్సవం



ఉద్యోగ విరమణ చేసిన శేషగిరిరావు, సాంబశివరావులను సన్మానిస్తున్న డీఆర్వో మురళీ

నాదెండ్ల: ఒత్తిడి లేని నాణ్యమైన విద్యకు కేంద్రియ విద్యాలయం చిరునామా అని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, విద్యాలయ నామినీ చైర్మన్ ఏకా మురళి చెప్పారు. ఇర్లపాడు విద్యాలయలో శనివారం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎండీ ఫరూక్ పాఠశాల యొక్క వార్షిక నివేదికను వినిపించారు. అనంతరం పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పి.శేషగిరిరావు, సాంబశివరావులను సత్కరించారు. డీఆర్వో మురళీ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 400 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు రూ.38 కోట్లతో నిర్మించిన నూతన భవనాల్లో విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో మెరుగైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున జిల్లాలో ఉన్న విద్యాలయాలతో పోటీపడి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. సుమారు రూ.3 కోట్లతో స్టాఫ్ నివసించేందుకు క్వార్టర్స్ కూడా నిర్మించారన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

సాక్షి విలేకరులపై దాడికి జర్నలిస్టుల సంఘం నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

చిలకలూరిపేట: జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పుల్లగూర భక్తవత్సలరావు కోరారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేములలో సాక్షి విలేకరిపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే అనుబంధ చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం, మీడియా స్వేచ్ఛను హరించటం అన్యాయమన్నారు. విధి నిర్వహణలో ఉన్న సాక్షి టీవీ కరెస్పాండెంట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక విలేకరి రామరాజారెడ్డిలపై జరిగిన దాడి సభ్య సమాజంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. విలేకర్ల కెమెరాలు, వారి సెల్‌ఫోన్లు లాక్కొని ధ్వంసం చేయడం, దాడి చేసి కొట్టడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఇలాంటి దాడులను ప్రోత్సహించకుండా, పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన దుండగులపై హత్యాప్రయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జిలానీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి, చిలకలూరిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నలదాసు శేషగిరిరావు, షేక్ అబ్దుల్ సత్తార్, ఉప్పాలబాలు, మానం నారాయణస్వామి, కాట్రు శ్రీనివాసరావు, ధూళిపాళ శ్రీనివాసరావు, చుక్కా విజయ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సీఐ

నరసరావుపేటటౌన్: గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను శనివారం సీఐ ఎం.వి.చరణ్ వెల్లడించారు. అక్రమంగా గంజాయి కలిగిన కేసులో రెండు నెలల క్రితం ఐదుగురిని అరెస్ట్ చేయగా కేసులో నిందితుడు వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ అష్రఫ్ పరారీలో ఉన్నాడన్నారు. అతని కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో మొదటి రైల్వే గేట్ అంధుల పాఠశాల వద్ద అష్రఫ్ 1350 గ్రాముల గంజాయి, చోరీ చేసిన ద్విచక్ర వాహనంతో పట్టుబడ్డాడన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి అమ్మటం వలన ఎక్కువ ఆదాయం వస్తుందని భావించి పట్టణానికి చెందిన షేక్ షరీఫ్, చావపాటి ఉమర్ సాధిక్‌లను కలుపుకొని వైజాగ్ నుంచి వారి సొంత కారులో రహస్యంగా గంజాయిను అక్రమంగా తీసుకొచ్చి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసినట్లు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బుల్లెట్లు, ఒక పల్సర్, మూడు స్కూటీ వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహన చోరీలకు సంబంధించి యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇప్పటికే వన్‌టౌన్, టూటౌన్, మంగళగిరి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. కేసులో ప్రతిభ కనపరిచిన ఎస్ఐ పి.వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, రాజేష్, కోటేశ్వరరావులను డీఎస్పీ కె.నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

విద్య ద్వారానే అత్యున్నత స్థాయి



సత్తెనపల్లి (ముప్పాళ్ళ): సమాజంలో విద్య ద్వారానే అత్యున్నత స్థాయికి చేరగలమని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఒ.జాన్సన్ పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో కార్ట్స్ సంస్థ బాలబాట ఆర్గనైజర్ల సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి సంస్థ డీడీ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లకు నెలవారి దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత, ఏసీఓ పుల్లారావు, బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.